## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థికసాయం



కార్యకర్త ఆశన్న నగదును అందజేస్తున్న కౌన్సిలర్

కొల్లాపూర్, అక్టోబర్ 15 : మండలంలోని బోయలపల్లిలో అనారోగ్యంతో ఆదివారం మృతిచెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఆశన్న కుటుంబాన్ని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌డ్డి ఫోన్‌లో పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంపిన ఆర్థికసాయం రూ.10వేలు, క్వింటా బియ్యాన్ని కౌన్సిలర్ చిట్టెమ్మరవి బాధిత కుటుంబానికి అందజేశారు. కుటుంబానికి అండగా నిలిచి నా వంతుగా సహాయసహకారాలు ఎల్లవేళలా ఉంటాయని ఆయన భరోసా ఇచ్చారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు మండ్లగోవిందు,కురుమయ్య,మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు,భోగ్యం వెంకటేశ్, రఘుపతి, సురేశ్, కరుణాకర్, శివకుమార్,పురుషోత్తం తదితరులున్నారు.

## ఎన్నికల కోడ్ నిబంధనలను పాటించాలి

పెంట్లవెల్లి, అక్టోబర్ 15 : కేంద్ర ఎన్నికల సంఘం విధించిన కోడ్ నిబంధనలను ప్రతిఒక్కరూ తప్పకుండా పాటించాలని ఎస్సై బండారిసురేశ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజలు శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా అధికారులకు సహకరించాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో మండలంలోని వివిధ గ్రామాలతోపాటు మండల కేంద్రంలో బెల్ట్ దుకాణాల్లో మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రజలు తమ అవసరాల కోసం నగదు తీసుకెళ్లే సమయంలో రూ.50 వేలు మించితే వీటికి సరైన ఆధారాలు చూపించాలన్నారు. లేకుంటే డబ్బులను సీజ్ చేస్తామన్నారు. ఎన్నికల నిబంధనలను రాజకీయ నాయకులు తప్పకుండా పాటించాలని చెప్పారు. సోషల్ మీడియాలో ప్రజలను ప్రలోభపెట్టే విధంగా పోస్టులు, రెచ్చగొట్టే విధంగా పెడితే వారిపై కోడ్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

# బీరం బీఫాం తీసుకోవడంపై హర్షం



పెంట్లవెల్లిలో పటాకులు పేలుస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పెంట్లవెల్లి, అక్టోబర్ 15 : నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బీరం హర్షవర్ధన్‌రెడ్డి సీఎం కేసీఆర్ చేతులమీదుగా బీఫాం తీసుకోవడంపై ఆదివారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు సంబురాలు నిర్వహించి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాజేశ్, సురేందర్‌గౌడ్, మతీన్, పోతుల వేంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గత 18 ఏండ్లుగా అధికారంలో ఉన్న మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు చేయలేని అభివృద్ధిని ఎమ్మెల్యేగా గెలిచిన అతితక్కువ సమయంలో కేవలం కరోనాతో 2ఏండ్ల కాలం వృథాగా పోయిన.. మిగిలిన రెండున్నరేండ్లలో నియోజకవర్గాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించారని వారు కొనియాడారు. మండల కేంద్రం సమీపంలో వంతెన నిర్మించామని, నదీ తీర గ్రామాలైన మల్లేశ్వరం, ఎంగంపల్లితండా, వేంకల్ గ్రామాల ప్రజలు గతంలో అధికారంలో ఉన్న మాజీ మంత్రి జూపల్లిని కన్నీటితో వేడుకోగా కంటి తుడుపుగా ఆ గ్రామాల ప్రజల ముందు అదిగో జీవో, ఇదిగో ఆడర్ కాపీ అంటూ.. కాలం వెల్లదీశారని వారు మండిపడ్డారు. అంతేకాక మల్లేశ్వరం సమీపంలో కృష్ణానదీతీరం నుంచి మినీలిఫ్ట్ ఇరిగేషన్ చేపట్టాలని ఎన్నిమార్లు మొరపెట్టుకున్న లాభం లేక పోయిందన్నారు. అంతేకాక శింగవరం, గోప్లాపురం, కొండూరు గ్రామాల్లో ప్రవహిస్తున్న వాగుపై చెక్‌డ్యాం నిర్మాణాలు ఇలా ఎన్నో సమస్యలు మాజీ మంత్రి ముందు వినపించుకున్న అభివృద్ధికి తాళం వేశారని వారు ఎద్దేవాచేశారు. ఎమ్మెల్యే బీరం గెలిచిన అతితక్కువ సమయంలో సమస్యలను పరిష్కరించడమేకాక గ్రామాలను కనివిని ఎరుగని అభివృద్ధి చేసి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించారని వారు పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బీరంను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని వారు పిలుపునిచ్చారు.

## ఎల్లూరు రిజర్వాయర్‌లో వదిలిన 4.24లక్షల చేపపిల్లలు

కొల్లాపూర్, అక్టోబర్ 15 : తెలంగాణ ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లలను జలాశయాల్లో వదలడంతో మత్స్యసంపద వృద్ధిచెంది తద్వారా మత్స్యకారులు ఆర్థిక పరిపుష్టత చెందుతారని మండల ఎల్లూరు మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఎల్లూరు శివారులోని మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలోని మొదటి రిజర్వాయర్ (ఎల్లూరు)లో మత్స్యశాఖద్వారా 4.24లక్షల బొచ్చె, మిగలా, రొవ్వ రకాల చేపపిల్లలను వదిలారు. కార్యక్రమంలో మత్స్యశాఖ పీల్ట్‌మెన్లు అంజయ్య, శ్రీకాంత్, నరసింహ, రాజ్‌కుమార్, మత్స్యసహకార సంఘం సభ్యులున్నారు.



చేప పిల్లలను వదులుతున్న మత్స్యశాఖ అధికారులు, సొసైటీ అధ్యక్షుడు సత్యనారాయణ

# ప్రారంభమైన దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

## బాల త్రిపురసుందరీదేవీగా దర్శనం



కొల్లాపూర్‌లో పూజలు చేస్తున్న భక్తులు

కొల్లాపూర్, అక్టోబర్ 15 : పట్టణంలో వరిదేల శమీవృక్ష ఉత్సవ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో దుర్గాదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 13వ వార్షికోత్సవం ఆదివారం తొలిరోజున బాల త్రిపుర సుందరీదేవీ అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని అర్చకుల వేదామంత్రోచ్ఛరణలతో ప్రతిష్ఠించారు. భక్తులు అమ్మవారికి దీపారాధరణ చేశారు.

**పెద్దకొత్తపల్లిలో..**

మండలంలోని పెద్దకార్పాముల, పెద్దకొత్తపల్లి, ముష్టిపల్లి, సాతాపూర్, పెద్దకొత్తపల్లి గ్రామాల్లో ఘనంగా దేవీ నవరాత్రుల పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చంద్రమౌళి, కిశోర్, రాజశేఖర్, సాయిప్రకాశ్, శంకర్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.



చిన్నంబావి : అమ్మాయిపల్లిలో అమ్మవారు ..



వీపనగండ్లలో...



కొల్లాపూర్‌లో అమ్మవారికి దీపారాధరణ ఉత్సవ కమిటీ

**చిన్నంబావిలో..**

చిన్నంబావి, అక్టోబర్ 15 : మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో దేవీశరన్నవరాత్రుల ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. గ్రామాల్లోని ఆలయాలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారు కొలువుదీరారు. మొదటి రోజూ అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. తొమ్మిదిరోజుల పాటు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ, మండపాల నిర్వాహకులు, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

**వీపనగండ్లలో..**

వీపనగండ్ల, అక్టోబర్ 15 : మండల కేంద్రంతో పాటు తూంకుంట, గోవర్ధనగిరి గ్రామాల్లో దుర్గాదేవీ మండపాలు ఏర్పాటు చేసి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి వివిధ రూపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు.



పెద్దకొత్తపల్లిలో పూజలు ..

## మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలి



సంతకాల సేకరణ చేపడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

చిన్నంబావి, అక్టోబర్ 15 : దేశంలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందని, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చొరవ తీసుకొని మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ఆంజనేయులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం దేశవ్యాప్తంగా అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం, సామాజిక సంఘాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టగా అందులో భాగంగా మండల కేంద్రంతో పాటు దగడపల్లిలో తదితర గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదవర్గాలపై, నిత్యం హత్యలు, అత్యాచారాలు, దాడులు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎం.ఈశ్వరయ్య, అల్లెన్న పాల్గొన్నారు.

## రాష్ట్ర వికాససమితి పారిశ్రామిక కన్వీనర్‌గా కొల్లాపూర్ వాసి



మియ్యాపురం రమేశ్

కొల్లాపూర్,అక్టోబర్ 15 : తెలంగాణ వికాస సమితి రాష్ట్ర పారిశ్రామిక విభాగం కన్వీనర్‌గా కొల్లాపూర్ వాసి చెర్లపల్లి పారిశ్రామికవాడ ఫేస్-3 అధ్యక్షుడు రమేశ్ ఆదివారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికాస సమితి మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు కొనసాగి ప్రజాప్రయోజక కార్యక్రమాల్లో పాల్గొని స్థానిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేసినట్లు చెప్పారు. తెలంగాణ వికాస సమితి రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా తన వంతు కర్తవ్యాన్ని అంకితభావంతో నిర్వహించానని, తనపై నమ్మకంతో ఇచ్చిన ఈ బాధ్యతను మరింత ముందుకు సాగుతుందన్నారు. గత కొన్నేండ్లుగా విడుదల కాని పారిశ్రామిక సబ్సిడీల విడుదల కోసం తన వంతు కృషిచేస్తానన్నారు. చిన్న సూక్ష్మతరహా పరిశ్రమలకు అండగా ఉంటూ, వారి సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి కృషిచేస్తానని ఆయన పేర్కొన్నారు. తనను తెలంగాణ వికాస సమితి రాష్ట్ర పారిశ్రామిక విభాగ కన్వీనర్‌గా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌కు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌కు రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు.